క్లుప్తంగా

బకాయి పన్నులు చెల్లించాలి

సూర్యాపేట : మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపార, వాణిజ్య, ఇంటి యాజమాన్యులు పన్నులు, నల్లా బిల్లు బకాయిలను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ పి. రామానుజులరెడ్డి శనివారం తెలిపారు. పన్నులు, బిల్లుల చెల్లింపునకు ఆదివారం కూడా కౌంటర్లు తెరిచి ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

రేణుకాఎల్లమ్మ కల్యాణానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

నాగారం : నాగారం మండల కేంద్రంలో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే శ్రీ రేణుకాఎల్లమ్మ కల్యాణోత్సవానికి హాజరుకావాలని కోరుతూ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు శనివారం సూర్యాపేటలో ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పరశురాములు, శ్రీరాములు, మల్లయ్య, మహంకాళి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక


సిద్ధార్థ

తుంగతుర్తి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు మండలపరిధిలోని వెంపటి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థి పాలవెల్లి సిద్ధార్థ ఎంపికైనట్లు హెచ్‌ఎం మోతె శ్రీనివాస్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెంపటి జెడ్పీహెచ్‌ఎస్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి పాలవెల్లి సిద్ధార్థ 2022–23లో జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాయగా 117 మార్కులు సాధించి స్కాలర్ షిప్‌నకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని అభినందించారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం అవివేకం

తుంగతుర్తి : తెలంగాణ వ్యాప్తంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దిష్టి బొమ్మలు దహనం చేయడం బీఆర్‌ఎస్ నాయకుల అవివేకమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపాక బాబా అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవిత విచారణ అంశాన్ని ప్రజల నుంచి పక్కదారి పట్టించేందుకే బీఆర్‌ఎస్ బండి సంజయ్ మాటలను వక్రీకరిస్తూ కొత్త నాటకానికి తెరలేపిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్సీగా ఉండి ఏనాడూ మహిళల హక్కుపట్ల మాట్లాడని కవిత తన తప్పును కప్పిపుచ్చుకోవడానికే ధర్నా చేపట్టిందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఉప్పుల పద్మలింగయ్య, బీజేపీ నాయకులు గాజుల మహేందర్, కత్తుల నరేష్, అంబటి రమేష్, నారాయణదాసు, నాగరాజు, మధు, లక్ష్మణ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్

భానుపురి : పట్టణంలోని 43వ వార్డులో గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ హాజరై మాట్లాడారు. పట్టణంలో దాదాపు 1200 మంది గృహ కార్మికులు ఉన్నారని, వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గృహకార్మికుల యూనియన్ పట్టణ కోఆర్డినేటర్ కాస అనసూర్య, బీఆర్‌ఎస్ నాయకురాళ్లు బత్తుల ఝాన్సీ, కవిత, సంఘం అధ్యక్షురాలు బింగి రేణుక, నాగమ్మ, మల్లిక, నిర్మల, శారద, పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలి

కోదాడరూరల్ : మాయమాటలతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గణపవరం, తొగర్రాయి, బీక్యాతండా, రామలక్ష్మీపురం గ్రామాల్లో ఆయన హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించి మాట్లాడారు. రాహుల్ గాంధీ చేపట్టిన జోడో యాత్రతో దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ సారి రాష్ట్రం, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతిలో కూరుకపోయాయని ఆరోపించారు. ఆ పార్టీ నాయకులు ప్రజాసేవ మరిచి సంపదనే లక్ష్యంగా ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. బీఆర్‌ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవూరి వెంకటాచారి, పులి సులోచనరావు, ఇర్ల సీతరాంరెడ్డి, సుమన్‌రెడ్డి, కొప్పుల శ్రీనివాసరెడ్డి, సాగర్‌రెడ్డి, కన్నారెడ్డి, సుభాష్‌రెడ్డి, కాలతిరిపి పాపులు, నరసింహారెడ్డి, లిక్కి వెంకటయ్య, వేనేపల్లి నర్సింహారావు, జడ వెంకటేశ్వర్లు, బాషా, నాగరాజు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

పనులు జరిగితే పూర్వవైభవమే!

- అర్వపల్లి శ్రీయోగానంద ఆలయానికి రూ. 5కోట్లతో చేపట్టనున్న పనులు
- ఎన్నికల సమయానికి పూర్తిచేసేలా ఏర్పాట్లు


అర్వపల్లిలో పునర్నిర్మాణంలో ఉన్న శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం


పూర్తిగా శిథిలమైన రథశాల

అర్వపల్లి : జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి దేవాలయానికి పూర్వ వైభవం తేవడానికి ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయి. అయితే ఇక్కడి ఆలయం పురాతనమైనది కావడం, శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ఈ పునర్నిర్మాణానికి సరిపోను నిధులు రాకపోవడం, సకాలంలో పనులు చేపట్టక ఇంతకాలం అభివృద్ధికి నోచుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇక్కడి ఆలయాన్ని ఎలాగైనా ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్ది అన్ని సౌకర్యాలు కల్పించుటకు తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక్కడి భక్తులు, ప్రజాప్రతినిధులు, ప్రజల వినతి మేరకు ఆలయ విశిష్టతను ప్రభుత్వానికి తెలియజేసేలా గతంలో శాసనసభ సమావేశాల సందర్భంగా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. యాదాద్రి కన్నా ముందు ఉన్న ఈ దేవాలయాన్ని అభివృద్ధి చేస్తే బాగుంటుందని ప్రస్తావించారు. అయితే గతంలో రూ. 1.30 కోట్లను సీఎం కేసీఆర్ మంజూరు చేయగా పనులు కొంత వరకు జరిగాయి. పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఇటీవల ఎస్‌డీఎఫ్ ద్వారా రూ. 5కోట్లను సీఎంతో మంజూరు చేయించారు. ఈ నిధులకు సంబంధించి జిల్లా కలెక్టర్ నుంచి ప్రొసీడింగ్ జారీ చేసి తాజాగా వర్క్ ఆర్డర్ కూడా ఇచ్చారు. దీంతో త్వరలో టెండర్ ప్రక్రియను చేపట్టనున్నారు. త్వరగా పనులు మొదలు పెట్టి వచ్చే ఎన్నికల వరకు పూర్తి చేసేలా ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు.

ఆలయంలో చేపట్టనున్న పనులు ఇవే..

ఆలయంలో ఇటీవల రూ. 20లక్షలతో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ స్వచ్ఛందంగా ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేయగా, మంత్రి జగదీశ్‌రెడ్డి తన కుటుంబీకుల ఆధ్వర్యంలో రూ. 1.30 కోట్లతో మహారాజ గోపురాన్ని నిర్మిస్తానని ప్రకటించారు. ఈ పనులు త్వరలో మొదలయ్యే అవకాశం ఉంది. ఇది కాక ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 5కోట్లతో ఆలయానికి ఉత్తర, దక్షిణ, పడమర, మూడు చోట్ల రాజగోపురాలు రూ.1.23కోట్లతో, అలాగే 1.41కోట్లతో ప్రాకార మండపం, రూ.62లక్షలతో మాడ వీధుల నిర్మాణం, రూ.62లక్షలతో రాతితో కల్యాణమండపం నిర్మాణం, రూ.37లక్షలతో రథశాల నిర్మాణం, రూ.25లక్షలతో యాగశాల, మరో రూ.25లక్షలతో పాకశాల, స్టోర్‌రూం, రూ.25లక్షలతో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులన్నీ పూర్తయితే ఆలయానికి పూర్వ వైభవం రానుంది. ప్రముఖ పుణ్యక్షేత్రంగా మారనుంది.

నిధుల మంజూరు హర్షణీయం



అర్వపల్లి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం రూ. 5కోట్లు మంజూరు చేయడం హర్షణీయం. మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డిల సహకారంతో సీఎం కేసీఆర్‌తో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌కు నిధులు మంజూరు చేయించడం పట్ల కృతజ్ఞతలు. మంజూరైన నిధులతో పనులు పూర్తయితే ఆలయానికి పూర్వ వైభవం రానుంది.

– దావుల వీరప్రసాద్‌యాదవ్, జెడ్పీటీసీ


వైభవంగా బ్రహ్మోత్సవాలు జరిపిస్తున్నాం



దేవాలయానికి పూర్వ వైభవం తేవడానికి మూడేళ్ల నుంచి బ్రహ్మోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నాం. దీనికి తోడు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు కావడం హర్షణీయం. ఈ నిధులతో ఆలయం ఎంతో అభివృద్ధి కానుంది.

– చిల్లంచర్ల విద్యాసాగర్, దేవస్థానం చైర్మన్

విద్య, ఉపాధి కోసం ఉద్యమించాలి


మాట్లాడుతున్న ఇందూరు సాగర్

నాగారం : విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలకై యువత ఉద్యమించాలని పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందూరు సాగర్ పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని డి.కొత్తపల్లిలో నిర్వహించిన ప్రగతిశీల యువజ సంఘం(పీవైఎల్) మండల మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో నిరుద్యోగ సమస్య విలయతాండవం చేస్తోందన్నారు. నోటిఫికేషన్లు తప్ప ఉద్యోగాల భర్తీ లేదని, ఉన్నత చదువులు చదివినా ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. దీనికి పాలకులే ప్రధాన కారణమని విమర్శించారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించి, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుసుకుంట్ల సైదులు, జిల్లా కార్యదర్శి కుసుకుంట్ల సైదులు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, వేముల గణేష్, అరుణోదయ జిల్లా నాయకులు తడకమళ్ల నాగమల్లు, దేశోజు మధు, నర్సిరెడ్డి, బయ్య లింగయ్య పాల్గొన్నారు.

రేపు సంతు సేవాలాల్ జయంతి


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

తుంగతుర్తి : నూతనకల్ మండలంలో సోమవారం నిర్వహించే సంతు సేవాలాల్ మహరాజ్ 284వ జయంతి వేడుకలను జయప్రదం చేయాలని మండల గిరిజన సంఘం నాయకులు కోరారు. శనివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. జయంతి ఉత్సవాలకు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌లు హాజరవుతారని తెలిపారు. వేడుకల్లో గిరిజన నాయకులు, మహిళలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం నాయకులు గుగులోతు దీప్లానాయక్, యాకునాయక్, నర్సింహ, నాగునాయక్, వీరు, వీరన్న పాల్గొన్నారు.

జయంతి వేడుకలను విజయవంతం చేయాలి


నూతనకల్ : శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని తహసీల్దార్ ఎండీ. జమీరుద్దిన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13న సేవాలాల్ 284వ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని సాయిరాం ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు.

సీతారామచంద్రస్వామికి చక్రస్నానం


ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ ఆవుల సతీష్‌దంపతులు

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి చక్రస్నానతీర్థం, పూర్ణాహుతి, అగ్నిహోమం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులు సీతారామచంద్రస్వామి విగ్రహాల ఊరేగింపు నిర్వహించి, దూప, దీప, నైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఆవుల సతీష్, వైస్‌చైర్మన్ మామిడి మల్లయ్య, ఆలయ కమిటీ డైరెక్టర్లు మిరప అంజయ్య, గడ్డల ఉపేందర్, బెల్లంకొండ ఉప్పలయ్య, నల్ల రమేష్, సంపతి శంకరమ్మ, అర్చకులు మాధవాచార్యులు, కూరేశం సంతోష్‌కుమార్, సాకేతపురం చరణ్, సాయి, దత్తు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలకులను పారదోలాలి


మాట్లాడుతున్న పటేల్ రమేష్ రెడ్డి

చివ్వెంల : కేంద్రం, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలనను సాగిస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలను పారదోలాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శనివారం హాత్‌సే హాత్ జోడో యాత్రలో భాగంగా మండల పరిధిలోని అక్కలదేవిగూడెం, బి.చందుపట్ల గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించి మాట్లాడారు. దేశంలో పేదల అభివృద్ధి కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాట స్ఫూర్తితో సూర్యాపేట నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇప్పటికే రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి జగదీశ్‌రెడ్డి ఏనాడూ ప్రజాసమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోదాల రంగారెడ్డి, ఫరూఖ్, వెలుగు వెంకన్న, కొండ వెంకన్న, నామా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

అర్వపల్లి : ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శనివారం లచ్చిరాంతండాలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. కంటి వెలుగు, హరితహారం, ఇతర పథకాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సారథి జిల్లా టీం లీడర్ మేడిపల్లి వేణు, సభ్యులు వెన్నెల నాగరాజు, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, పి.రాములు, ఉపేందర్, లక్ష్మణ్, మంజుల, నాగలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

ఉండ్రుగొండలో వైభవంగా సుదర్శన హోమం


సుదర్శన హోమంలో పాల్గొన్న భక్తులు


చివ్వెంల : ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు శనివారం సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ రవికుమార చార్యులు, అరవిందాచార్యులు మంత్రోచ్ఛరణతో స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం


తిరుమలగిరిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


తుంగతుర్తిలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మహిళలు


అర్వపల్లిలో ఎస్‌ఐ అంజిరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేస్తున్న మహిళా నాయకులు

సూర్యాపేట : శాసనమండలి సభ్యురాలు కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సూర్యాపేట పట్టణంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డపై అనుచిత వ్యాఖ్యలు చేయడం బండి సంజయ్‌కు తగదన్నారు. తక్షణమే కవితకు క్షమాపణలు చెప్పాలని అన్నారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టా కిశోర్, బీఆర్‌ఎస్ మహిళా నాయకురాళ్లు నిమ్మల శ్రవంతి, కల్లేపల్లి మహేశ్వరి, విజయ, దండు రేణుక, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బండి సంజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడంపై నిరసనగా శనివారం బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక తెలంగాణ చౌరస్తాలో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌పై కేసు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, జెడ్పీటీసీ దూపటి అంజలి, మార్కెట్ చైర్‌పర్సన్ కొమ్మినేని స్రవంతి, కౌన్సిలర్లు జ్యోతి, రాజ్యలక్ష్మి, శ్రీలత, ప్రియలత, గోవిందమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, మోహన్‌బాబు, నరోత్తమ్‌రెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కించపరుస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ మహిళలు బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చెరుకు సృజనపరమేష్, కాంతమ్మ, విమల, అరుణ, పద్మ, వెంకటమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, శ్రీను, దీప్లానాయక్, మధు, మల్లేష్, రవికుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.


వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి

మద్దిరాల : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎమ్మెల్సీ కవితపై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎంపీపీ గుడ్ల ఉపేంద్ర వెంకన్న, జెడ్పీటీసీ కన్న సురాంబ వీరన్నగౌడ్, వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

అర్వపల్లి : ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై వెంటనే కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం రాత్రి అర్వపల్లి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఎస్‌ఐ అంజిరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన వారిలో అర్వపల్లి దేవస్థాన డైరెక్టర్ మెండె సురేష్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా నాయకులు వేముల గణేష్, ఉయ్యాల రాము, పేర్ల గణేష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

బాలికలకు స్వేచ్ఛ కల్పించాలి


మాట్లాడుతున్న చిప్పలపెల్లి రవి

నూతనకల్ : సమాజంలో బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా తల్లిదండ్రులు వారికి స్వేచ్ఛను కల్పించాలని ఎంవీ ఫౌండేషన్ మండల బాధ్యుడు చిప్పలపెల్లి రవి కోరారు. ఐసీడీఎస్, ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని టీక్యాతండాలో నిర్వహించిన మహిళా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఆచార సంప్రదాయాల పేరిట బాలికల కదలికలపై ఆంక్షలు విధిస్తున్నారని అన్నారు. లింగ వివక్ష నిర్మూలన కోసం బాలురతో సమానంగా బాలికలకు విద్యాబుద్ధులు నేర్పించాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ ఎం. బుజ్జి, మహిళలు ఉప్పమ్మ, జ్యోతి, కళ్యాణి, అక్షిత, మహేశ్వరి, జామ్లీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

తొట్ల మల్సూర్‌కు ఘన నివాళి


దురాజ్‌పల్లి : నివాళులర్పిస్తున్న నాయకులు


నూతనకల్‌లో..

దురాజ్‌పల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఎం ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడు తొట్ల మల్సూర్ ఆశయ సాధనకు పోరాటాలు ఉధృతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మల్సూర్ 24వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం, వేల్పుల వెంకన్న, జె.నరసింహారావు వీరబోయిన రవి పాల్గొన్నారు.

నూతనకల్ : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు తొట్ల మల్సూర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి కోరారు. తొట్ల మల్సూర్ వర్ధంతిని శనివారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు అందెపల్లి లక్ష్మయ్య, కూసు సైదులు, బాణాల నర్సిరెడ్డి, బత్తుల శ్రీను, బాలగాని సోమయ్య, పోయినపాక మధు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ పొట్టా కిరణ్‌కుమార్


కోదాడరూరల్ : ఏ ఆహారంలో ఎలాంటి పోషక విలువలు ఉంటాయో విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని పట్టణంలోని మాస్టర్ మైండ్ స్కూల్ ప్రిన్సిపాల్ పొట్టా కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించి ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రోటీన్స్, విటమిన్స్ ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు, ధాన్యాలు వంటి ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలని, బేకరి ఫుడ్స్‌కు పిల్లలను దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. మంచి ఆహారం తీసుకున్నప్పుడే మానసిక ఎదుగుదల ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

మతసామరస్యానికి ప్రతీక అర్వపల్లి దర్గా


శ్రీకాంత్‌రాజ్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు

అర్వపల్లి : అర్వపల్లి శివారులోని హజ్రత్ ఖాజానసీరుద్దీన్‌బాబా దర్గా మతసామసర్యానికి ప్రతీకగా నిలుస్తుందని తెలంగాణ ఉద్యమకారుడు, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజు అన్నారు. అర్వపల్లి శివారులోని ఖాజానసీరుద్దీన్‌బాబా దర్గాను శనివారం సందర్శించి ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యుడు ఫత్తేపురం విజయ్‌కుమార్, అర్వపల్లి దేవస్థాన మాజీ చైర్మన్ బైరబోయిన సైదులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రసాద్ యాదవ్ కన్నుమూత



సూర్యాపేట రూరల్ : మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి గ్రామానికి చెందిన మామిడి ప్రసాద్ యాదవ్ అనారోగ్యంతో కన్నుమూశారు. గతకొంత కాలంగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతూ శనివారం రాత్రి కన్నుమూశారు. ప్రసాద్ యాదవ్ వార్డు మెంబర్‌గా, జెడ్పీటీసీగా, పెద్దగట్టు చైర్మన్‌గా పని చేశారు.

పోలీస్ స్టేషన్లకు చేరిన ఇంటర్మీడియట్ ప్రశ్నపత్రాలు


తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించిన ప్రశ్నపత్రాలు

తుంగతుర్తి : ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు శనివారం తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ సందర్భంగా ఎగ్జామ్ చీఫ్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. తుంగతుర్తిలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షలకు మొత్తం 750 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతరం ప్రశ్నపత్రాలను పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. కార్యక్రమంలో డీఓ శ్రీనివాస్, పుల్లయ్య, గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఈ నెల 15వ తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాలు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరాయి. ఈ సందర్భంగా కస్టోడియా చీఫ్ సూపరింటెండెంట్ వేముల బాలరాజు మాట్లాడారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 284 మంది ద్వితీయ సంవత్సరంలో 325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్.లింగం, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు నయిం, బి.నవీన్ పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

నడిగూడెం : మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లాపురంలో ఉర్దూ పాఠశాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ముస్లింల జీవితాలు దుర్భర స్థితిలో ఉండేవని, టీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి చెందారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, సర్పంచ్ వట్టికూటి చంద్రయ్య, మైనార్టీ నాయకులు అల్తాఫ్ హుస్సేన్, ఇస్సార్, రఫీ, షఫీ, జానీ, మహ్మద్, ఇమామ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

స్టడీ మెటీరియల్ పంపిణీ

మునగాల : మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో పదవ తరగతి విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం స్టడీ మెటీరియల్, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కస్తూరి ఫౌండేషన్ నిర్వాహకుడు, విద్యుత్ శాఖ ఏఈ జిల్లా శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ సునీత, జిల్లా సుధాకర్, శ్రీకాంత్ చారి, దేవరశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.